


"బ్రహ్మాండమైన ఛాన్స్ గురో!" అంటూ సూపర్‌మేన్ లాగా ఎగురుకుంటూ వచ్చాడు సత్తిబాబు.

ఆఫీసులో దీక్షగా పని చేసుకుంటున్న మిగిలిన వాళ్ళంతా సీరియస్‌గా, గుర్రుగా నా వైపు చూశారు.

సత్తిబాబుగాడికి ఎన్నిసార్లు చెప్పినా విని చావడు. కుదురుగా బుద్ధిగా రావచ్చుగా! రాడు... రకరకాల ఎంట్రీలు ఇస్తాడు. ఒకసారి చెట్టు మీద నుంచి చింపాంజీ దూకినట్లు దూక్కుంటూ వస్తాడు. మరోసారి దరిద్రపు శబ్దాలు చేసే రోడ్ రోలర్‌లాగా దూసుకుంటూ వస్తాడు. నా ఖర్మ వాడ్ని ఏమీ అనటానికి లేదు... చెడ్డీల కాలం నాటి ఫ్రెండ్...

"ఏంటీ?" అన్నాడు విసుగ్గా.

అంత హైపిచ్‌లో అరుచుకుంటూ వచ్చిన వాడల్లా రహస్యం చెబుతున్నట్లుగా గొంతు పాతాళంలో వున్న స్థాయికి మరీ తగ్గించి "క్యాంటీన్‌కు పద... అక్కడ చెబుతా..." అన్నాడు.

నాకు ఒళ్ళు మండింది. "ఏ... ఇక్కడ చెప్పలేవా?"

"టాప సీక్రెట్ గురో! ఇక్కడొద్దు..." అంటూ గుసగుసలాడాడు.

క్యాంటీన్‌లో కూర్చున్నాక సత్తిబాబు పెదాలు చెవులదాకా సాగదీసి విశాలంగా నవ్వుతూ "ముందు నాకేదైనా స్వీట్ తెప్పించు..." అన్నాడు.

మిడ్‌నైట్ మసాలా చూస్తున్న రసపట్టు టైంలో కరెంటు పోతే మండినట్లు మండింది నాకు. "స్వీట్ తింటానికేనా ఇంత దూరం నుంచీ ఎగురుకుంటూ వచ్చావ్?" కసిగా అన్నాను.

వాడు దాన్నేమీ పట్టించుకోలేదు. తను చేయాలనుకున్నదీ, చెప్పాలనుకున్నదీ, తప్ప ఎదుటివాళ్ళ ఫీలింగ్స్ గురించి అరంగుళం కూడా పట్టించుకోని మనస్తత్వం వాడికి ఎలిమెంటరీ స్కూల్ నుంచే ఉండేది. పెద్దయ్యాక ఇంకా పెరిగింది. క్యాంటీన్ కుర్రాడి తెచ్చిన గులాబ్ జామ్ స్పూన్‌తో ఎత్తి నోట్లో వేసుకుని "మ్చ్... మ్చ్....." అంటూ సౌండ్ చేశాడు. తిండి తగ్గించమని డాక్టర్లూ, వాళ్ళావిడా ఎంత మొత్తుకున్నా పట్టించుకోని సత్తిబాబుకు సరదా పుట్టి ఓసారి బరువు చూసుకుందామని వెయింగ్ మిషన్‌మీద నిలబడితే పాపం అది కాస్తా రెండు ముక్కలయింది. అంతటి తిండిపుష్టి మా వాడిది. నాలుగు గులాబ్‌జామ్‌లను క్షణకాలంలో నోరు అనబడే బ్లాక్‌హోల్‌లోకి తోసేసి పెదాలకంటిన దాన్ని నాలుకను వృత్తంలా తిప్పుతూ నాకుతూ "నువ్వు సిన్మా రైటర్‌వి అయిపోతున్నావు గురో!" అన్నాడు.

"నువ్వేమైనా సిన్మా తీస్తున్నావా?" అన్నాను హేళనగా.

ఊరాంగ్ ఉటాంగ్ నవ్వినట్లుగా కిచకిచమంటూ నవ్వాడు సత్తిబాబు. ఆ భంగిమ పోలికలు, ఆకారం, సౌండ్స్ వింటే అంతరించిపోతున్న అరుదైన ప్రాణి దొరికిందని సంబరపడుతూ 'జూ'వాళ్ళు సత్తిబాబుగాడిని ఎత్తుకెళ్ళిపోవటం ఖాయం.

నేను సినిమా తీయటం ఏమిటి నా బొంద... ఆ ఫైనాన్స్ కంపెనీ వాడిని తప్పించుకుని తిరగటానికే తిన్నదంతా అరిగిపోయి చిక్కి శల్యం అయిపోతున్నాను. సరే కానీ పద... పద.. అర్జెంటుగా బంజారా హోటల్ కెళ్ళాలి..." అన్నాడు.

"ఏం నాయనా! ఇక్కడ తిన్నది చాల్లేదా?"

"ఛీ! అందుక్కాదూ..." సత్తిబాబు చిరాక్కున్నాడు.

"మరెందుకో!" నేనూ అంతే విసుగ్గా అన్నాను. వీడి లింకులు లేని దరిద్రపు సంభాషణ ఏంటో నాకు అర్థం కావటం లేదు. బుద్ధిగా ఆఫీసులో కూర్చుని ఫైల్స్ చూసుకుంటున్న నన్ను డిస్టర్బ్ చేసింది కాకుండా ఏంటేంటో మాట్లాడుతున్న వాడి మీద ముక్కుల దాకా కోపం ముంచుకొస్తుంది నాకు...

"అమెరికా నుంచి ఓ పెద్దాయన వచ్చాడంట..."

"వస్తే?"

"ఆయన సినిమా తీస్తున్నాడంట..."

"తీస్తే?"

"కథల కోసం వెదుకుతున్నాడంట..."

"వెదికితే?"

"ఇంత చెప్పినా ఇంకా అర్థం కాలేదా నీకు? మనం అర్జెంటుగా వెళ్ళిపోయి ఆయనకు సిన్మా కథ చెప్పేసామనుకో... ఆయన సినిమా తీస్తాడు. నువ్వు సిన్మా రైటర్‌వి అయిపోతావు... నేను నా ఫ్రెండ్స్ దగ్గర కాలర్ ఎగరేసుకోవచ్చు..."

"నేను సిన్మా రైటర్నైతే నువ్వు కాలర్ ఎగరేయటం ఏమిటి? అదీ కాకుండా సిన్మా కథంటే నాయర్ హోటల్‌లో పెసరట్టులో ఇడ్లీ నంజుకుని తినటం అనుకున్నావా?"

సత్తిబాబు అకస్మాత్తుగా ఫీలింగులు మార్చేసి నా వైపు ముళ్ళపంది చూసినట్టు చూశాడు.

"హు... మిత్రద్రోహీ! నీ కోసం అష్టకష్టాలూ పడి సమాచారం సేకరించుకుని వస్తే ఎగిరి గంతేయాల్సింది పోయి నన్నే విమర్శిస్తావా? నువ్వు ఏమన్నా అనుకో నాకు అనవసరం... నిన్ను మాత్రం సిన్మా రైటర్‌ని చేయకుండా వదిలిపెట్టను..." భీష్మ ప్రతిజ్ఞ లాంటిది చేశాడు.

"అది కాదు సత్తిబాబూ..." నేను నచ్చచెప్పేందుకు ప్రయత్నించాను "సిన్మా కథంటే బోలెడు తతంగం ఉంటుంది. అది మనకు సరిపడదు... సీన్స్ క్యారెక్టరైజేషనూ..." నేను ఇంకా పూర్తి చేయకుండానే సత్తిబాబు "ఆఁ... వంకాయ పచ్చడీ, గోంగూర పప్పూ ఏం కాదా! అయినా నీ టాలెంట్ సంగతి గరుత్మంతుడిలాగా నీకు తెలీదు. నాకు తెలుసు... ఇంకేం మాట్లాడకుండా అర్జెంటుగా బయలుదేరుతున్నావా, లేదా?" అన్నాడు.

"ఇప్పుడా?" సందేహంగా అన్నాను. సత్తిబాబు వదిలిపెట్టడని అర్థమైంది. "ఆఫీస్ అయ్యాక సాయంత్రం వెళదాం..."

"ఇంకా నయం... సిన్మా రిలీజ్ అయ్యాక కథ చెబుదామన్లేదు పిచ్చి ముఖంగాడా! అవకాశాలు లేకుండా జనం ఏడుస్తుంటే నువ్వేంటి మీనం, మేషం లెక్కేస్తావు! పద... పద..."

"కనీసం పర్మిషన్ తీసుకుని వస్తాను సత్తిబాబూ... మా ఆఫీసరు మండిపడతాడు..."

"ఈ బోడి డబ్బా ఉద్యోగం ఉంటే ఎంత? పోతే ఎంత? రేపు నువ్వు సిన్మా రైటరైతే లక్షలూ, కోట్లూ సంపాదించవచ్చు... ఇంకేం మాట్లాడకుండా నడువ్..." నా చేయి పట్టుకుని బరబరా లాగాడు.

కట్ చేస్తే...

* * *

మేమిద్దరం బంజారా హోటల్లో ఉన్నాం.


నాకు ఎందుకో బెరుగ్గా ఉంది. ఫైవ్‌స్టార్ హోటల్‌కొచ్చిన బెరుకు కాదు. ఎక్కడో అమెరికా నుంచొచ్చిన పెద్దాయన ఎవరికో సిన్మా కథ చెప్పటం తాలూకు బెరుకు. బుద్ధిగా నోర్మూసుకుని ఉద్యోగం చేసుకునే నేను తీరిక దొరికినప్పుడల్లా నాకు తోచింది రాసుకుని పత్రికలకు పంపేవాడిని. అది అచ్చవ్వటం మొదలయ్యాక నాకూ కొంచెం పేరొచ్చింది. నేనేం ప్రొఫెషనల్ రైటర్ని కాదు. అది ఎంత మొత్తుకున్నా సత్తిబాబుకు అర్థం కాదు. నేను ఎప్పటికైనా సిన్మా రైటరయిపోవాలని వాడి ఆశ. 'అది అంత తేలిగ్గా సాధ్యపడదురా నాయనా!' అని ఎన్నిసార్లు చెప్పినా వాడు పట్టించుకోడు.

* * *

ఐదో ఫ్లోర్‌లో వున్న రూమ్ నెంబర్ ట్వంటీ ముందు నిలబడి బెల్ ప్రెస్ చేశాడు.

"కమిన్..." అని వినబడే సరికి ఇద్దరం లోపలకు ప్రవేశించాము.

అరవై ఏళ్ళ వయస్సుండే ఓ పెద్దాయన సోఫాలో కూర్చుని టీ.వి. చూస్తున్నాడు. పంచె,



లాబీలో అచ్చమైన తెలుగు బిడ్డ లాగా కనబడుతున్న ఆయన్ని చూడగానే ఆశ్చర్యం వేసింది. మేం వచ్చిన పని చెప్పాక ఆయన మమ్మల్ని కూర్చోమన్నాడు.

"నా పేరు సోమశేఖరరావు... ముప్పై ఏళ్ళ క్రితం బ్రతుకు తెరువు కోసం అమెరికా వెళ్ళి ఎన్ని కోట్లు సంపాదించినా నా మనస్సు, ఆలోచనలు ఎప్పుడూ ఇక్కడే ఉంటూ వచ్చేవి. మన సంస్కృతీ, సాహిత్యమంటే నాకు ప్రాణం. నా పిల్లలు పెద్దవాళ్ళయి, వాళ్ళ జీవితాల్లో సెటిలయ్యారు. ముప్పయి ఏళ్ళ పాటు ఇంజనీరుగా పనిచేసి అలసిపోయిన నాకు ఇంత కాలం తర్వాత విశ్రాంతి దొరికింది. మంచి తెలుగు సినిమా తీయాలనేది నా జీవిత లక్ష్యం. అందుకే ఇండియా వచ్చాను. మీ దగ్గర మంచి సబ్జెక్టు ఏదైనా ఉంటే చెప్పండి..." అన్నాడాయన.

నాకు చాలా ఆనందం వేసింది. ఇంత కాలం తర్వాత కూడా పుట్టిన గడ్డను మర్చిపోకుండా ఉండటం ఈ రోజుల్లో నిజంగా గొప్ప విషయం. ఆయన మాటతీరూ, సంస్కారం, వేషభాషలు చూస్తుంటే ఆయన మీద గౌరవభావం కలిగింది.

నేను నోరు తెరిచి ఏదో చెప్పేలోగా 'ధడేల్...' మన్న శబ్దంతో రూమ్ తలుపు తెరుచుకుంది. భూకంపం వచ్చిందేమోనన్న సందేహంతో ముగ్గురం తలలు త్రిప్పి చూశాం.

గుమ్మంలో ఒకావిడ నిలబడి వుంది. గుమ్మటంలా లావుగా, పొట్టిగా ఉంది. బాగా రొప్పుతూ వుంది. గునగునా దొర్లుడులాంటి నడకతో మా దగ్గరకు వచ్చి "అరుంధతొచ్చిందా?" అంది.

### ప్రియుడి కోసమై...?

ఐశ్వర్యారాయ్ ఇటీవల ముంబయి నుంచి లండన్ వెళ్ళి కాలు ఫ్రాక్చరై హాస్పిటల్ పాలయిన తన ప్రియుడు వివేక్ ఓబెరాయ్‌ను చూడటానికి ఫ్లయిట్ ఎక్కి పారిపోయింది. ఈలోపు వివేక్‌ను ఐసియు నుండి వార్డులోకి మార్చడంతో వారిద్దరూ కలిసి గడపడానికి కొంత టైమ్ దొరికింది. లేదు లేదంటూనే ఐష్, వివేక్‌లు జోరుగా ప్రేమాయణం సాగిస్తున్నారు.




మేము ఆశ్చర్యంగా ఆవిడవైపే చూస్తుండిపోయాము. ఆవిడ ఎవరో తెలీదు. ఏ అరుంధతి గురించి అడుగుతోందో అంతకంటే తెలీదు.

"అరుంధతి వచ్చిందాని అడిగితే అలా చూస్తారేంటి? పోనీ దమయంతికానీ ఆండాళ్ళు కానీ వచ్చారా?" అనడిగింది రొప్పుతూనే.

కొంచెం తేరుకున్న సోమశేఖరంగారు 'ఇంతకీ మీరెవరు? మీకెవరు కావాలి?" అని అడిగారు సౌమ్యంగానే.

"నేను ఎవరో తెలీదా?" ఆశ్చర్యంగానే అడిగింది. ఏ రేంజ్‌లో అడిగిందంటే ఐశ్వర్యారాయ్ కూడా ఆ రేంజ్‌లో అడగదు. "నన్ను గుర్తుపట్టలేదంటే ఆశ్చర్యంగా వుందే! నేను ఆంధ్రుల అభిమాన ప్రఖ్యాత రచయిత్రి శమంతకమణిని. నా రచనల కోసం పాఠకులు ఎగబడతారు. ఇంతకీ మీలో సిన్మా తీసేదెవరు?" అనడిగింది.

అప్పటికి విషయం కొంచెం అర్థమయినట్లనిపించింది.




"సిన్మా ఛాన్స్ అనగానే నా కంటే ముందు ఆ దరిద్రపుగొట్టు అరుంధతి, ఆ చుప్పనాతి దమయంతి ఎగేసుకుంటూ వచ్చేస్తారని ఎంత భయపడ్డానో!. వాళ్ళను నమ్మమాకండి. కంత్రీ ముండలు..." కసిగా అంటూ సోఫాలో కూలబడింది. ఆవిడ బరువుకి స్ప్రింగులు కుయ్...మన్నాయి మా మనస్సుల్లాగానే.

దరిద్రపు ఎంట్రీలివ్వటంలో మా సత్తిబాబుగాడే ప్రసిద్ధుడనుకుంటూ వచ్చాను ఇంతవరకూ, కానీ ఈవిడే వరస చూస్తుంటే సత్తిబాబుగాడు ఆవిడ ముందు సోదిలోకి కూడా నిలబడలేడని అర్థమైంది.

"ఊc... ఇప్పుడు చెప్పండి మీకు ఏ టైపు కథలు కావాలో! ఏది కావాలంటే అదిస్తాను... క్రింద లారీలో ఉన్నాయి..." అంది గుక్క తిప్పుకోకుండా.

"లారీలోనా?"

"అవును... నా కథలన్నీ లారీలో వేసుకుని వచ్చేశాను.. మీరేం మొహమాటపడకండి ఏది కావాలంటే ఆ కథ చెబుతా..." అంది.

నాకు కళ్ళు గిర్రున తిరిగినంత పనయ్యింది. సోమశేఖరంగారి పరిస్థితి ఏమిటో నాకు తెలీదు. అసలు పేరే ఎప్పుడూ వినని ఈ ప్రఖ్యాత రచయిత్రి ఎవరో? కథలన్నీ లారీకెత్తించి తీసుకురావటం ఏమిటో? అర్థం కాక బుర్ర గిర్రున తిరక్క ఛస్తుందా! మేమిద్దరమే కాదు సత్తిబాబు గాడి లాంటి శాల్తీ కూడా వెర్రిముఖం వేసుకుని ఆవిడ వంకే చూస్తున్నాడు.

చాలా సేపటికి తేరుకున్న సోమశేఖరంగారు

'ఏదైనా మంచి కథ చెప్పండి...' అన్నారు.

"నేను అన్నీ మంచి కథలే చెబుతాను... సాహిత్యాన్ని ఉద్ధరించేందుకే నేను కలం పట్టాను. సరస్వతీ దేవి కన్నీరు తుడిచేందుకే నేను రచయిత్రినయ్యాను. బ్రహ్మాండమైన లేడీ ఓరియెంటెడ్ కథ చెబుతా వినండి... ఈ కథ విందంటే విజయశాంతి డేట్స్ ఇచ్చేస్తుంది. హండ్రెడ్ డేస్ గ్యారంటీ. హండ్రెడ్ డేస్ ఏంటీ సంవత్సరం ఆడుతుంది. చెబుతున్నా వినండి... ఒకమ్మాయి ఉంటుంది. పెళ్ళవుతుంది. మొగుడూ, అత్తా, ఆడబడుచూ ఘోరమైన కష్టాలు పెడుతూ వుంటారు. ఫస్ట్ రీల్ నుంచీ పదమూడవ రీల్ దాకా ఆ అమ్మాయి పడే కష్టాలు చూపిస్తాం. లేడీ సెంటిమెంటన్న మాట. ఆడాళ్ళు కర్చీపులు తడిచిపోయేలా ఏడుస్తారు. దాంతో సిన్మా సూపర్‌హిట్.. లాస్టు రీల్లో హీరోయిన్ ఏం చేస్తుందో తెలుసా?"

"ఏం చేస్తుంది?" సత్తిబాబు కుతూహలంగా అడిగాడు.

"మామగారితో లేచిపోతుంది..."

ఈసారి నా కళ్ళతో పాటు హోటల్ రూమ్ అందులో ఫర్నీచర్ కూడా గుండ్రంగా తిరగడం మొదలయ్యింది. పాపం సోమశేఖరం గారయితే షాక్ కొట్టినట్టుగా బిగుసుకుపోయి కూర్చున్నారు.

"చూసారా? ఎంత వెరైటీ కథో..." గర్వంగా అందావిడ మా వైపు చూస్తూ.

"మరీ మామగారితో లేచిపోవటం అంటే ప్రేక్షకులు..." నేను పూర్తి చేయలేక నసిగాను.

అంతే గయ్యిమంటూ లేచింది. "మీ మొగాళ్ళ బుద్దే అంత... ఎప్పుడూ స్త్రీని అణగదొక్కుతూనే ఉంచారు. ఫెమినిజం అంటే మీకేం తెలుసు?

"ఇంత మంచి వెరైటీ పాయింట్‌తో కథ చెబితే వంకలు పెడతారా?" అంటూ ఇరవై నిమిషాల పాటు నాన్ స్టాప్‌గా వాయించేసింది.

అదంతా విని కూడా మేము ఇంకా బ్రతికున్నామంటే మా పెళ్ళాల తాళిబొట్లు గట్టివి కావటం వల్లనే... వాయింపుడి కార్యక్రమం అయిపోయిన తర్వాత సీరియస్‌గా ముఖం పెట్టి "నా కథ బాగుంది కదూ!" అంది శమంతకమణి రెట్టిస్తూ.

"నీ బొందలా ఉంది... ఇట్లాంటి సిన్మాలు తీస్తే ప్రేక్షకులు ఎడ్రసులు వెతుక్కుని ఇళ్ళకొచ్చి మరీ మడ్డి కోటింగిస్తారు తల్లీ...' పైకి అనే సాహసం చేయలేక మనసులో కసిగా అనుకున్నాను. సోమశేఖరం గారు ఏమనుకుంటున్నారో ఆ బ్రహ్మ దేముడికే తెలియాలి... వెర్రి ముఖాలేసుకుని తలలాడించాము.

"మీరు పత్రికల్లో రాస్తూ ఉంటారా మేడమ్?" నోర్మూసుకుని కూర్చోకుండా సత్తిబాబుగాడి కందిరీగ తుట్టని కదిలించాడు.

దాంతో ఆవిడ మళ్ళీ విజృంభించింది. "రాస్తూ ఉంటానా?" హూ... ప్రఖ్యాత రచయిత్రిని పట్టుకుని ఎంత చచ్చు ప్రశ్న. ఇదిగో చూడండి..." అంటూ వెంట తెచ్చిన బ్యాగులో నుంచి బాగా నలిగిపోయిన పత్రిక ఒకదాన్ని బైటకు తీసింది. "ఇందులో నా కవిత వేసారు... ఆ దెబ్బకు పత్రిక సర్క్యులేషన్ అమాంతం లక్షకు పెరిగిపోయింది. నా ఫోటో కూడా వేశారు చూశారా? దాన్ని చూసి పాఠకులు ఒకటే ఉత్తరాల మీద ఉత్తరాలు... మీరు రైటర్ కాకుండా హీరోయిన్ అయితే బాగుండేదంటూ. .. నిజంగా ఫోటోలోనే చాలా స్మార్ట్‌గా, క్యూట్‌గా ఉన్నాను కదా! అసలు చెప్పాలంటే నేను హీరోయిన్ కావల్సినదాన్నే... " అంటూ మళ్ళీ ఎత్తుకుంది.

ఆవిడ స్వంత డబ్బా దెబ్బకు పదిహేను నిమిషాలయ్యేసరికి మేము మలేరియా రోగుల్లా తయారయ్యాం. మా ముఖాలు పీక్కుపోయి, కళ్ళు లోతుకు పోయి సోమాలియా కరువు పీడిత బాధితుల్లా రూపాంతరం చెందబోతున్న క్రమంలో మమ్మల్ని రక్షిస్తున్నట్టుగా కాలింగ్ బెల్ మోగింది.

"అమ్మయ్య... బ్రతికాం" అనుకున్నాం కానీ ఆ క్షణంలో మాకు తెలీదు మా పరిస్థితి పెనం మీద నుంచి డైరెక్టుగా పొయ్యిలోకి ప్రయాణం చెయ్యబోతుందని...

లారెల్ అండ్ హార్డ్ కాంబినేషన్‌లా వున్న ఇద్దరు వ్యక్తులు లోపలికి ప్రవేశించారు.

"హల్లో... ఎవ్విరీ బడీ... ఐ యామ్ జంబులింగం సిన్మారైటర్..." స్టయిల్‌గా చేయి గాల్లోకెత్తి తనను తాను పరిచయం చేసుకున్నాడు సన్నగా గాలి వీస్తే ఎగిరిపోయేటట్లుగా వున్న వ్యక్తి.

జంబులింగం ఏదో ఒక్క లింగం... సమయానికి ఆపద్భాంధవుడిలా శమంతకమణి స్వంత డబ్బా తాలూకు ఉపద్రవం నుంచి మమ్మల్ని రక్షించటానికి ఏతెంచిన మహానుభావుడు.


"సిన్మా రైటరంటే నా పేరు మీరెప్పుడూ తెర మీద చూసి వుండకపోవచ్చు. ఎందుకంటే నేను దయ్యం రచయితను కాబట్టి... దయ్యం రచయితనంటే కంగారు పడుతున్నారా? అదే ఘోస్ట్ రైటర్‌ని. రాసేది నేనయితే తెరమీద వేరే వాళ్ళ పేరు కనిపిస్తుంది. సరే వదిలేయండి... నిజంగానే మీకు మంచి సిన్మా తీసే ఆలోచనుందా?" అని ప్రశ్నిస్తూ మా ఎదురుగా వున్న సోఫాలో కూలబడ్డాడు. అతని వెంట వున్న పర్వతకారుడు కూడా కూర్చున్నాడు. జంబులింగం ప్రవేశంతో తాత్కాలికంగా తన స్వంత డబ్బాను ఆపిన శమంతకమణి తిరిగి దాన్ని వాయించే సన్నాహాల్లో వుండగా ప్రమాదాన్ని పసిగట్టిన సోమశేఖరంగారు "మంచి సిన్మా తీయాలన్నది నా ఆకాంక్ష. మీ దగ్గర మంచి కథ ఏదైనా ఉందా?" అని జంబులింగాన్ని అడిగారు.

"కథ సంగతి తర్వాత ముందు అతిథి మర్యాదలేం లేవా?" అన్నాడు జంబులింగం.

"ఓ... సారీ... ఏం తీసుకుంటారు? "టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్" సోమశేఖరం గారు ఆఫర్ చేశారు.

జంబులింగం నోరు విశాలంగా తెరిచి వికటాట్టహాసం లాంటిది చేశాడు. "టీ, కాఫీనా? మీకు సిన్మా స్టోరీ సిట్టింగుల సంగతి తెలీదనుకుంటానే?

మందు పడందే బండి కదలదు. డోంట్ వర్రీ... నేనే ఆర్డర్ చేసుకుంటాను" అంటూ ఫోన్



దగ్గరకు లాక్కుని రిసీవర్ ఎత్తి రూమ్ సర్వీస్‌కు ఆర్డర్ చేయటం, ఆ తర్వాత ఐదు నిమిషాల్లోనే వాళ్ళొచ్చి విస్కీ బాటిల్స్, సోడా, పెప్సీ, థమ్సప్, చికెన్-65, ఫ్రాన్స్, చిప్స్, వేయించిన జీడిపప్పు, తరితర మంచింగ్ సామాగ్రి టేబుల్‌మీద సర్దేసి వెళ్ళిపోవటం మేమంతా గుడ్లప్పగించి చూస్తుండిపోయాం:...

నాకు సోమశేఖరంగారిని చూస్తే జాలేసింది.

జంబులింగం, అతని వెంట వచ్చిన పర్వతకారుడు - ఇద్దరూ ఏ మాత్రం ఫీలింగులు లేకుండా గ్లాసులో విస్కీ పోసుకుని సోడా కలుపుకుని త్రాగుతూ చికెన్, రొయ్యలు, చిప్స్



కరకరా నమిలేయటం మొదలుపెట్టారు.

ప్రక్కనే కూర్చున్న సత్తిబాబు గాడు నన్ను గిల్లటం మొదలెట్టాడు. కళ్ళముందు రుచికరమైన ఫైవ్ స్టార్ వంటకాలు కన్పిస్తూ వుండేసరికి వాడిలో సదా మేలుకునే వుండే బకాసురుడు వళ్ళు విరుచుకోవటం ప్రారంభించాడు. నేను కళ్ళతోనే వద్దని వారించటం, వాడు వాటి వైపు గండుపిల్లిలా చూస్తూ వుండటం మరో ఐదు నిమిషాలు కొనసాగిన తర్వాత శమంతకమణి జీడిపప్పులు నోట్లో వేసుకోవటంతో సత్తిబాబుగాడు కంట్రోల్ తప్పి చటుక్కున చికెన్ లెగ్ పీస్ అందుకుని నమలసాగాడు.

నేనూ సోమశేఖరం గారే ఖాళీగా మిగిలాం. మిగిలిన వాళ్ళంతా వాళ్ళ పనుల్లో బిజీగా ఉన్నారు. అరగంట గడిచేసరికి మరో బాటిల్ విస్కీ, నాలుగు కోళ్ళూ, డజను గుడ్లు, ఫిష్, ఆమ్లెట్స్ మాయమైపోయాయి. వాళ్ళ తిండి వరస చూస్తూంటే కేవలం తినటం, త్రాగటం కోసం ఇక్కడకు వచ్చినట్లుగా ఉంది. ఇక సత్తిబాబు, శమంతకమణి కూడా యధావిధిగా న్యాయం చేకూరుస్తూ దవడలు ఆడిస్తూనే ఉన్నారు.

ఆ ఫైవ్‌స్టార్ హోటల్ రూంలో వాళ్ళు నలుగురూ తింటూ, నములుతూ, చీకుతూ, ఎముకల్లోంచి మూలగ పీలుస్తూ చేస్తున్న విచిత్రమైన శబ్దాలు ఓ.టి.ఎస్. ఎఫెక్ట్‌లో ప్రతిధ్వనించసాగాయి. మరో ఇరవై నిమిషాల తర్వాత రెండో బాటిల్ ఖాళీ చేసిన జంబులింగం తలెత్తాడు...

## అవన్నీ రూమర్స్

ఇటీవల బిపాసాకు సంజయ్‌దత్‌కు మధ్య మనస్పర్థలు తలెత్తాయని బాలీవుడ్ పత్రికలు కోడై కూస్తున్నాయి. ప్రస్తుతం బిపాసా సంజయ్ దత్‌తో కలిసి 'నెహలేపే దెహలా' చిత్రంలో నటిస్తోంది. ఏమిటి నీకు సంజయ్‌దత్‌కు నిజంగానే పడటం లేదా అని అడిగితే, 'అదేం లేదు. అదే నిజమైతే నేను సంజయ్‌దత్‌తో నటించడానికి మరో చిత్రాన్ని అంగీకరించేదాన్ని కాదు కదా. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు' అంటూ ఖండించింది.

"ఆఁ... చెప్పండి..." అన్నాడు ముద్దముద్దగా.

"చెప్పాల్సింది మీరు... అందుకే ఇక్కడకొచ్చింది..." నాకు తెలీకుండానే నా గొంతులో కోపం ధ్వనించిందనుకుంటా... జంబులింగం కంటి గుడ్డు తిప్పి నా వైపు చూశాడు.

నాకు భయమేసింది.

మనిషైతే అర్భకుడిలా ఉన్నాడు కానీ ఆ ఎర్రబడ్డ కళ్ళు, ముఖం, తూలుతున్న శరీరం చూసే సరికి అసలే కోతి... అన్న సామెత గుర్తొచ్చింది. జంబులింగం క్షణకాలం నావైపు పిచ్చ సీరియస్ లుక్కేసి ఒక్కసారిగా ఫెళ్ళుమని నవ్వాడు.

"బ్రహ్మాండమైన సబ్జెక్ట్ చెబుతా... షూటింగ్ చంద్రమండలం మీద పెట్టుకోండి..." అన్నాడు బాటిల్లో ఇంకా ఏమైనా మిగిలిందేమోనన్న సందేహంతో దాన్ని అటూ ఇటూ త్రిప్పుతూ.

"చంద్రమండలం లోనా?"

"యా... చంద్రమండలంలోనే అదే వెరైటీ... ఇంత వరకూ ఎవ్వరూ తీయలేదు... మనమే ఫస్ట్... సాంగ్స్ శుక్రగ్రహం మీద తీసారంటే వరల్డ్ రికార్డయిపోతుంది...." అన్నాడు తూలుతూ.

"శుక్రగ్రహం మీదకు ఇంత వరకూ మనుష్యులు వెళ్ళలేదే!"

"వెళ్ళలేదా? పోనీ జపాన్‌లో చింగ్‌చాంగ్ అగ్నిపర్వతం దగ్గర సాంగ్స్, ఆఫ్రికాలో పిరమిడ్స్ దగ్గర ఫైట్స్ తీద్దాం..."

"ఆఫ్రికాలో పిరమిడ్స్ ఎక్కడున్నాయి... పిరమిడ్స్ ఉంది ఈజిప్ట్‌లో కదా!" అన్నారు సోమశేఖరం గారు అయోమయంగా.

"అదే మరి వెరైటీ అంటే..." జంబులింగం మరోసారి ఫెళ్ళుమంటూ నవ్వాడు. "మనం ఆఫ్రికాలో పిరమిడ్స్ సెట్స్ వేస్తామన్న మాట..."

"పిరమిడ్స్ సెట్స్ కోసం ఆఫ్రికా దాకా పోవటం ఎందుకూ?" అన్నాన్నేను.

జంబులింగం నా వైపు సీరియస్‌గా చూసి "ఇతనెవరు? మాటిమాటికీ అడ్డుపడుతున్నాడు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్రా?" అడిగాడు.

"కాదు... ఆయన కూడా రచయితే... మీ అందరికంటే ముందొచ్చాడు" అన్నారు సోమశేఖరం గారు.

"రచయితా? అదీ కుళ్ళు... అందుకే నా సబ్జెక్ట్ ఓ.కె. కాకుండా అడ్డుపడుతున్నాడు..."

"మీరింకా సబ్జెక్ట్ చెప్పందే..." అన్నాన్నేను వళ్ళు మండి.

"చెబుతా... కళ్ళు తిరిగిపోయే సబ్జెక్ట్ చెబుతా..." అంటూ శమంతకమణి వైపు చూస్తూ "ఈవిడెవ్వరు మీ సిన్మాలో హీరోయినా..." అని ఇంకా పూర్తి చేయకముందే శమంతకమణి భరించలేని ఆనందంతో అష్ట వంకరలూ తిరుగుతూండగా మిగిలిన వాక్యం పూర్తి చేశాడు.

"ఏం బాలేదు... ఛండాలంగా వుంది..."

అంతే... శమంతకమణి జూలు విదిల్చిన శివంగిలా రెచ్చిపోతూ..." త్రాగుబోతు ధొంగ సచ్చినోడా! నీ పిండం రాక్షస బల్లులకు పెట్టా... నా పర్సనాలిటీ, అందం గురించి కామెంట్ చేస్తావట్రా... ఆ రోజుల్లో నేను కాలేజీ బ్యూటీనిరా కుక్కా..." అంటూ తిట్ల దండకం మొదలుపెట్టింది. నేనూ, సోమశేఖరంగారూ గట్టిగా చెవులు మూసుకుని కూర్చున్నాం. ఇదంతా ఏ మాత్రం పట్టించుకోని సత్తిబాబు, పర్వతకారుడు ప్లేట్లలో మిగిలినవాటిని నాకుతుంటే జంబులింగం ఆ తిట్లకు ఏ మాత్రం కోపం తెచ్చుకోకుండా సోఫాలో తల వెనక్కు వాల్చి కళ్ళు మూసుకుని కాళ్ళు చిద్విలాసంగా



ఊపసాగాడు.

తిట్టీ తిట్టీ అలసిపోయిన శమంతకమణి నిస్రాణంగా సోఫాలో వెనక్కు వాలిన తర్వాత "ఇప్పటికైనా కథ చెబుతారా?" అసహనంగా అన్నారు సోమశేఖరం గారు జంబులింగంతో.

"ఆc... చెబుతా వినండి... ఓ పల్లెటూరు, వర్షాలు పడవు... జనం అల్లాడిపోతూ ఉంటారు... హీరో క్రికెట్ మ్యాచ్ ఆడి ఆంగ్లేయుల్ని ఓడిస్తాడు..."

సోమశేఖరం గారు మరింత అసహనంగా "కథ చెప్పమంటే లగాన్ సిన్మా కథ చెబుతారేంటి?" అన్నారు.

జంబులింగం కళ్ళు తెరిచి, ఆశ్చర్యంగా ముఖం పెట్టి "ఈ కథ సిన్మాగా వచ్చేసిందా?" అడిగాడు.

"అవును.. అమీర్‌ఖాన్ సిన్మా లగాన్..."

"ఓర్నాయినోయ్!" ఒక్కసారిగా జంబులింగం హై పిచ్‌లో రాగం అందుకున్నాడు "ఎంత మోసం చేశావురా అమీర్‌ఖానూ! నాంపల్లి స్టేషన్‌లో కన్పించినపుడు 'స్టోరీ చెప్పు సోదరా' అని చెప్పగానే నేను వెర్రి వెధవలా కథ చెప్పటం ఏమిటి? నువ్వు నా పేరేయకుండా చెప్పుకోకుండా దాన్ని సుబ్బరంగా దొబ్బేస్తావా అమీర్‌ఖానూ!" అంటూ ఏడవటం మొదలుపెట్టాడు.

రెండు బాటిల్స్ విస్కీ తాలూకు మత్తు జంబులింగం నషాళానికి ఎక్కేసిందని ఎక్కువైపోయింది.

ఈసారి నా మీద నాకే జాలేసింది.

సోమశేఖరం గారు నిర్మాత కాబట్టి ఆయనకు తప్పదు. నాకేంటి అవసరం? అందులోనూ ముందొచ్చిన నేను కూర్చుంటే వెనకొచ్చిన వాళ్ళంతా కథల మీద కథలు (?) విన్పిస్తుంటే నేను వెర్రి వెంగళప్పలా వినటం నాకే ఏదోలా అన్పించింది.

మొత్తానికి సావుగంట సేపు ఏడ్చీ ముక్కు చీదీ అమీర్‌ఖాన్‌ను బండబూతులు తిట్టాడు. ఒక్క అమీర్‌ఖాన్ ఏంటి? స్పిల్‌బర్గ్, జేమ్స్ కెమరూన్, సుభాష్‌ఘై అందర్నీ అడ్డంగా తిట్టాడు. ఎందుకంటే టైటానిక్, జురాసిక్ పార్క్, తాళ్ సిన్మాల కథలు వాళ్ళంతా జంబులింగం నుంచి దొబ్బేసి సిన్మాలు తీసేసారంట. మొత్తం సిన్మా ఇండస్ట్రీని శాపనార్థాలు పెట్టాడు.

ఈ లెక్కన మిస్సమ్మ, మాయాబజార్, లవకుశ సిన్మా కథలు కూడా నేనే రాసానంటాడేమోనని భయమేసింది. అదృష్టవశాత్తు జంబులింగం అంత వెనక్కు పోలేదు. మళ్ళీ ఇంకో కథ చెప్పాడు.

అది కూడా రెండేళ్ళ క్రితం వచ్చిన సూపర్ హిట్ సిన్మా కథ.

"ఇది కూడా వచ్చేసిన సిన్మా కథే!" అంటే మళ్ళీ ఎక్కడ ఏ టేప్‌రికార్డేసి ఏ రాఘవేంద్ర రావునో, దాసరి నారాయణరావునో తిడతాడన్న సందేహంతో వీలైనంత త్వరగా జంబులింగాన్ని వదుల్చుకునేందుకు సోమశేఖరం గారు లౌక్యంగా "మళ్ళీ కలుద్దాం..." అన్నారు.

"అంటే... నా సబ్జెక్ట్ మీకు నచ్చినట్లే కదా!"

"అదే ఆలోచించి తర్వాత కబురు చేస్తాను..." అన్నారు.

"అయితే అడ్వాన్స్ ఇవ్వండి ముందు..."

"అడ్వాన్స్ ఏమిటి?" ఆశ్చర్యంగా ప్లస్ అయోమయంగా అడిగారు సోమశేఖరంగారు.

'నా సబ్జెక్టు నచ్చి మళ్ళీ పిలిపిస్తానన్నారు గదా!"

"నేను అలా అన్లేదు... ఆలోచిస్తానన్నాను..."

"నేనేం వెర్రి వెధవలా కన్పిస్తున్నానా మీ కళ్ళకు?" జంబులింగం ఒక్కసారిగా సీరియస్ అయిపోయాడు. "అందరూ నా కథలు కాపీ కొట్టేసి సిన్మాలు తీసేవాళ్ళే ... అందుకే నా జాగ్రత్తలో నేను ఉన్నాను. ఇతనెవరనుకున్నారు?" అప్పటికే మత్తు తలకెక్కి సోఫాలో జోగుతున్న పర్వతకారుడిని చూపిస్తూ "మా లాయర్...

## హైద్రాబాద్‌కు దూరం

నగరంలోని వివిధ పార్టీలకు తరచు హాజరయ్యే నమ్రతా శిరోద్కర్ కొద్ది రోజులుగా కనపించడం లేదు. దర్శకుడు జయంత్ పర్రానీ దంపతుల (హీరో మహేష్‌బాబుకు అత్యంత సన్నిహితులు) ఇంట్లోనే బస చేసే నమ్రత ఈ మధ్య వారి ఇంటికి కూడా రావడం మానేసింది. ఇందుకు కారణం 'ప్రైడ్ అండ్ ప్రిజుడిస్' చిత్రంతో ఆమె బిజీగా ఉండటమే. మరోవైపు మన హీరో మహేష్‌బాబు కూడా 'నాని' షూటింగ్‌లో బిజీగా ఉండటమే కారణం. అందువల్లనే ఈ జంట తాత్కాలికంగా దూరమైంది.

## సెక్సీ ఇమేజ్ అవసరమా?

దియామీర్జా మల్లికా, బిపాసా, సెలీనా, నేహ వంటి హాట్ హీరోయిన్స్‌ను పొగుడుతూనే తాను మాత్రం అలాంటి రోల్స్‌లో నటించనని ఖరాఖండిగా చెబుతోంది. ఇందుకు కారణం దియాకు గ్లామర్ హీరోయిన్స్‌కు ఉండవల్సిన పర్సనాలిటీ లేకపోవడం కాదట. మరెందుకు అంటే, 'నాకంటూ కొన్ని షరతులున్నాయి. అదీకాక ఒంటిని బాధపెట్టడం నాకిష్టం లేదు' అంటూ దియా తన సొంపుసొంపులను బయటపెట్టకపోవడానికి గల కారణాన్ని బయటపెట్టింది.



మర్యాదగా అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ చేసుకుంటారా లేకపోతే రేపీ పాటికి కోర్టుకు లాగి మూడు చెరువుల నీళ్ళు త్రాగిస్తాను... ప్రతి వాయిదాకీ అమెరికా నుంచి రాలేక ఆరిపోతారు... ఆలోచించుకోండి..." భయంకరమైన టెర్రరిస్టులా ముఖం పెట్టి బెదిరించాడు.

ఇదెక్కడి తద్దినంరా భగవంతుడా! అనుకుంటూ సోమశేఖరం గారు స్టన్నయిపోయారు. నాకైతే లేచి జంబులింగాన్ని నాలుగు పీకాలనిపించింది. ఇంతలో శమంతకమణి అందుకుని "మీరేం భయపడకండి నిర్మాతగారూ! ఈ బిక్కముఖంగాడు ఏమీ చేయలేడు. అవసరం అయితే నాకు తెల్సిన మస్తాన్‌దాదాను తీసుకొచ్చి వీడ్ని మర్డర్ చేయించే పూచీ నాది. మీకు ఎక్కువ ఖర్చేం కాదు. మహా అయితే రెండు వేల డాలర్లవుతుంది. మీరు మాత్రం నేను చెప్పిన లేడీ సబ్జెక్ట్ అదే 'మామగారితో లేచిపోయిన కోడలు' తీసారంటే బాక్సులు బద్దలైపోతాయి..." అంటూ తగులుకుంది.

సోమశేఖరంగారు నెత్తిన చేతులు పెట్టుకుని విషాదభరితమైన పోజుల్లో కూర్చున్నారు.

"అమెరికాలో హాయిగా ఉండక ఇక్కడకొచ్చిన ఈ దరిద్రాన్నంతా ఎందుకు తగిలించుకున్నానా దేముడా?' అన్న ఫీలింగ్ స్పష్టంగా ఆయన ముఖం మీద కనబడుతోంది.

బట్... ఇటీజ్ టూ లేట్...

ఇద్దరి దెబ్బకే పిచ్చెక్కే పరిస్థితి వస్తే, కథలు చెబుతామని ఇంకెంతమంది వస్తారో, వాళ్ళ దెబ్బకు సోమశేఖరంగారు ఏమైపోతారో అన్పించింది. నేను అలా అనుకున్నానో లేదో తలుపులు థన్‌మంటూ తెరుచుకుని సుడిగాలిలా ఓ శాల్తీ లోపలకు ప్రవేశించింది. శమంతకమణి కంటే భారీగా, పొట్టిగా వున్న ఆవిడ రావటం రావటంతోనే "హాంకాంగ్ టూర్ నుంచి రావటం వల్ల ఆలస్యమైపోయింది... మీలో నిర్మాతెవరో నాకు తెలీదు కానీ నా దగ్గర 'యమలోకంలో గెస్ట్‌హౌస్' అనే రసవత్తరమైన సబ్జెక్ట్ రెడీగా వుంది... షకీలాను పెట్టి నా సబ్జెక్ట్‌తో సిన్మా తీసారంటే ఇంక చూస్కోండి... మీకు డాలర్లే డాలర్లు. మొత్తం అమెరికా అంతా కొనుక్కోవచ్చు. షకీలా డేట్లు దొరక్కపోతే నో ప్రాబ్లం... అంతకంటే కత్తి లాంటి ఫిగర్స్ నాకు చాలామంది తెలుసు. మీరు ఊ అన్నారంటే అందరినీ పట్టుకొచ్చేస్తాను..." అంది భారీ స్థాయిలో రొప్పుతూ.

"కథల సంగతేంటోకానీ ఫిగర్స్ విషయం మాత్రం కరెక్టేనండీ నిర్మాతగారూ. ఎందుకంటే దీని ఒరిజినల్ బిజినెస్ అదే... ఆండాళ్ళు అండ్ కో అంటే సికింద్రాబాద్‌లో ఏ రిక్షావాడైనా తీసుకెళ్ళి పోతాడు..." పళ్ళు పటపటా కొరుకుతూ అంది శమంతకమణి.

అంతకంటే భారీ స్థాయిలో పళ్ళు కొరికి పైటచెంగు తీసి బొడ్లో దోపుకుంటూ "ఏంటే కోస్తున్నావు... నీ బ్రతుకు నాకు తెలీదనుకో మాకు... స్టోరీ సిట్టింగులని నువ్వు దేశం మీద పడి తిరుగుతుంటేనే కదా మీ ఆయన పనిమనిషిని తగులుకున్నాడు. నీ కథలు చదివేగా నీ కూతురు చేపలమ్ముకునే వాడితో లేచిపోయింది... నువ్వేమో లేపుకెళ్ళేవాడు దొరక్క పతివ్రతలా నటిస్తున్నావు కానీ నీ రంకు చరిత్ర నాకు తెలీదనుకోమాకు... అంటూ ఆండాళ్ళు విజృంభించింది.

అంతే...

ఫైవ్ స్టార్ హోటల్ రూమ్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.

రాజకీయవేత్తలు కూడా సిగ్గుపడే స్థాయిలో శమంతకమణి, ఆండాళ్ళూ బండబూతులు అన్ని భాషల్లోనూ తిట్టుకుంటూ అంతటితో సంతృప్తి చెందక వీర నారీమణుల్లా రెట్టించిన కడుపు మంటా, జెలసీల ప్రేరేపితులై కొప్పూ కొప్పు పట్టుకుని చీరలు ఊడిపోతున్నా ఏ మాత్రం వెనుకంజ వేయకుండా డైరెక్టుగా యుద్ధ రంగంలోకి దూకగానే

సోమశేఖరంగారు, జంబులింగం సోఫాల వెనక్కు నక్కారు.

నేనూ ప్రాణభయంతో వెనుదిరిగి చూడకుండా సత్తిబాబును వదిలేసి మరీ రూమ్‌లో నుంచి బైటకు పారిపోయాడు.

* * *

ఇంటికొచ్చి అరడజను కాఫీలు త్రాగి, రెండు బాటిల్స్ అమృతాంజనం ఒళ్ళంతా పూసుకుంటే కానీ శరీరం, మెదడూ ఓ దారికి రాలేదు... ఓరి దేముడో! ఇవేం సిన్మా స్టోరీ సిట్టింగులు... జీవితంలో వాటి జోలికే పోను... అంటూ ఒట్టేసుకున్నాను.

కానీ రెండో రోజుకు వళ్ళు దురదపెట్టింది.

'పనికిమాలిన వేస్టుగాళ్ళంతా సిన్మా స్టోరీలు చెబుతుంటే నేను దేంట్లో తక్కువ... మంచి కథ చెప్పి సోమశేఖరంగారిని ఆకట్టుకుంటాను' అనుకుని నాలుగు రోజులు నిద్రపోకుండా కూర్చుని మంచి స్టోరీ తయారుచేసుకుని ఉదయాన్నే బంజారా హోటల్‌కు బయలుదేరాను...

"సోమశేఖరంగారు నిద్ర లేచారా?" క్రింద రిసెప్షన్‌లో అడిగాను.

రిసెప్షనిస్ట్ నా వైపు విచిత్రంగా చూసింది. "ఆయనిక్కడెందుకుంటారు? పిచ్చాసుపత్రిలో ఉన్నారు..." అంది.

"పిచ్చాసుపత్రిలోనా?"

"అవును... అడ్డమైన సిన్మాకథలు వినీ వినీ ఆయనకు పిచ్చెక్కి పక్క రూమ్‌ల వాళ్ళకు, లిఫ్ట్ బాయ్‌లకు బలవంతంగా కథలు వినిపిస్తూ అల్లరి చేస్తూంటే నిన్ననే ఆయన్ని మెంటల్ హాస్పిటల్‌లో చేర్చాం..." రిసెప్షనిస్ట్ లేటెస్ట్ డెవలప్‌మెంట్ గురించి చెప్పింది.

నేను 'ఢామ్మ'ని విరుచుకుపడిపోయాను.

